# కోరుకున్న కొడుకు

(కథానిక)

సోమూతో నాకెలా పరిచయమైందో కాని, చివరకి చాలా విచిత్రమైన, గాఢమైన స్నేహంగా పరిణమించింది. అతడు కనిపించని రోజు అదోలా ఉండేది. ఆత్మీయత పెంపొందే కొద్దీ ఒకరిని విడిచి మరొకరుండడం బాధగా ఉండేది. ఈ మమకారానికి మేమిద్దరం కూడా అతీతులం కాలేకపోయాం. సోమూ వయస్సులో నాకన్నా ఏడేండ్లు చిన్న. కాని అతడిలో వయస్సుకి మించిన బుద్ధి కుశలత, చురుకుదనమూ కనిపించేవి అతడు చేసే ప్రతి పనిలో, మాటాడే ప్రతి మాటలో ప్రౌఢత కనిపించేది.

ఆ రోజు సాయంత్రం కాఫీ త్రాగుతున్నాము నేనూ, సోమూ—వాళ్ల మేడమీద గదిలో కూర్చొని.

“సోమూ! నీ విషయం ఏం బావుండలే”దన్నాను కాఫీ ఒక్క చుక్క చప్పరిస్తూ.

“ఏం” అన్నాడు కనుబొమ ఎగరేస్తూ తన మామూలు ధోరణిలో.

“ఏం ఏమిటి? ఆ ముసలాయన్ని, నీ విలా ఏడిపించటం ఎందుకు? పెద్దవాడు. అభిమానం కొద్దీ ఏదో చెబుతూంటాడు. నువ్వాయన మాట విన్నా, వినకపోయినా, యోగ్యంగానైనా శాంతంగా జవాబు చెప్పరాదూ? నీవలా కసిరి కొట్టేస్తే పాపం, ఆయన మనస్సెంత బాధ పడుతూందో నీకేం తెలుసు.”

“అవును. నీకు నే నాయన్ని కసిరి కొట్టట మొక్కటే కనిపిస్తుంది. మిగతా వేవీ నీకు అక్కర్లేదు. ఆయన సంగతి నీకేం తెలుసు?” అన్నాడు ముఖం జేవురించుకొని.

సోమూ, రాఘవయ్యగారి దత్తపుత్రుడు. సోమూని కన్న తల్లిదండ్రులు ఆటే ఉన్న వాళ్లు కారు. వాళ్ళకి సోమూ కాక ముగ్గురు మగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూను. అంత సంసారాన్ని పోషించలేకనే, రాఘవయ్య సోమూని దత్తత చేసుకొంటానంటే, వెంటనే ఒప్పుకొన్నాడు సోమూవాళ్ల నాన్న. కాని ఈ విషయం సోమూ తల్లికి తెలీదు. ఆమె ఎరుక లేకుండానే సోమూని రాఘవయ్యకు దత్తత చేసేశాడు. కాని ఈ విషయం తెలిశాక సోమూ తల్లి మూడు రోజులు పచ్చి మంచినీళ్లయినా ముట్టుకోలేదు. ఆమెకు సోమూ అంటే ఎంతో అభిమానం. సోమూని చూచుకొని మురిసిపోయేది. సోమూ పెద్దవాడయ్యాక హైకోర్టు జడ్జీ పని చేస్తాడని చుట్టుపట్ల అమ్మలక్కలతో చెప్పుకొని తన్మయత్వం చెందేది. సోమూని దత్తిచ్చే సంగతి ఆమెకి ముందుగా తెలిసిఉంటే ప్రాణత్యాగానికైనా సిద్ధపడేది. కాని, సోమూని విడిచి ఒక్క క్షణం ఉండడానికి ఒప్పుకొనేది కాదు. కాని తన ఎరుక లేకుండానే తన బిడ్డ తనకు దూరమయ్యాడు. ఇహ, సోమూ తన బిడ్డ అని చెప్పుకొనేందుకు కూడా తనకు అధికారం లేదు. సోమూ మీద మమకారం లోలోపలనే చంపుకోవాలని చూసింది. కాని ఎలా సాధ్యమవుతుంది? కన్న బిడ్డమీదమమకారం తల్లి పేగుకే తెలియాలి.

చిన్నతనంనుంచి రాఘవయ్యగారింట్లోనే పెరిగాడు సోమూ—తిండి గుడ్డ విషయంలో ఏ లోటూ లేకుండా. రాఘవయ్యకు కూడా సోమూ అంటే అభిమానమే. కాని అప్పుడప్పుడు శంకించేవాడు, సోమూకి తనయెడ పితృభావం లేదేమోనని; తనంటే గౌరవాభిమానాలు లేవేమోనని, సోమూ తలిదండ్రుల పక్షంవాళ్లు అతడి బుద్ధులను మార్చేసి, కుర్రవాణ్ణి చెడిపేస్తున్నారని అనుమానించేవాడు. నిజంలో సోమూ తలిదండ్రుల కెప్పుడూ అలాంటి ఉద్దేశమే లేదు. మనకు లేక కుర్రాణ్ణి దత్తుకిచ్చాం, వాడు సుఖంగా ఎక్కడో ఒక చోట ఉండటమే పదివే లనుకొనేవాళ్లు.

సోమూని దత్తు తీసుకోవటం మొదట్లో

“కిరణ్”

రాఘవయ్యగారి భార్యకు యిష్టంలేదు: తన దగ్గరచుట్టాలలో ఎవళ్లనేనా ఒక కుర్రాణ్ణి దత్తు తెచ్చుకోవాలనుకొంది. వీలుపడలేదు.

సోమూ అన్న మాటలమీద మళ్ళీ నేనే అన్నాను.

"అయితే సోమూ! నీవనేదేమిటి? ఆయన మాట వినటం, నీ ఆత్మాభిమానానికి,వ్యక్తిత్వానికి లోపం అంటావ్. అంతేనా" అన్నా.

"అది కాదు నేననేది. నేనాయన మాట విననటం లేదు. ఆయనంటే నాకు ఇప్పటికీ ఎప్పటికీ గౌరవముంది. కాని ఆయన కెందుకంత అనుమానం? ఈ పెంపుడమ్మ నన్ను చిన్నతనంలో "అమ్మా" అని పిలవలేదని ఎలా కొట్టేదనుకొన్నావ్! ఇప్పుడిప్పుడు కదూ వీళ్లంతా దార్లోకి రావటం! నీవు ప్రస్తుతాన్ని ఒక్కటే ఆధారంగా తీసుకొని మాటలాడుతున్నావు. నేను జరిగిపోయిన దానితో పోల్చుకొని మాట్లాడుతున్నా" నన్నాడు సోమూ.

తల వంచుకొని కాఫీ త్రాగుతూన్న వాడల్లా, సోమూ మాట్లాడటం ఆపేసేసరికి, వాడి కళ్ళలోకి అప్రయత్నంగా చూశాను. పల్చని నీటిపొర అతని కనులను కప్పేసింది. ఎన్నడూ కళ్ళనీళ్లు పెట్టనివాడు ఇవాళ కంట తడి పెట్టేసరికి నాకుకష్టంవేసింది. అనవసరంగా యీ ప్రస్తావన తీసుకొని వచ్చి అతని లేత మనస్సుకి బాధ కలిగించినందుకు నొచ్చుకొన్నాను.

"ఎందుకు సోమూ! ఏడవటం" అన్నాను బుజ్జగింపు స్వరంతో.

"ఏంలేదు. మా అమ్మ జ్ఞప్తి కొచ్చింది." అన్నాడు కనుకొలకులలోని నీరు తుడుచుకొంటూ.

జరిగిపోయిన విచార ఘట్టమేదో స్ఫురణకి వచ్చి అతని మనస్సుకి ఆందోళన కలిగించిందనుకొన్నాను. జీవితపు లోతులు తెలుసుకోలేని ఆ అర్భకప్రాయంలో యేదో హృదయానికి తీవ్రాఘాతం తగలండీ, అతడలా అవడని నాకు బాగా తెలుసు.

"సరిగ్గా పదేళ్ళ క్రిందట అనుకొంటాను" అని తనే ప్రారంభించాడు, ఎదురుగా ఉన్న కిటికీ ఊచలగుండా నిశ్చలదృష్టితో బాహ్యాన్ని చూస్తూ. నేను ఏంచెబుతాడో అని ఆదుర్దాగా వింటున్నాను.

* * *

"మా అమ్మా, నాన్నా నన్ను చూసిపోవటానికి వచ్చారు. అప్పటికి నాకు పదేళ్ళయినా సరిగా ఉంటాయో ఉండవో. తెల్లనివన్నీ పాలనీ, నల్లనివన్నీ నీళ్ళనీ అనుకొనే వయస్సు. ప్రపంచం లోతుపాతులు గ్రహించేశక్తి అప్పటికి ఇంకా నాలో కలగలేదు. చిన్నతనం నుంచీ ఈ యింట్లో పెరుగుతూండటంవల్ల, ఈ అమ్మా, నాన్నా పెంపకంలోనే బాగా అలవాటు పడిపోయాను. నన్ను కన్న తల్లిదండ్రులు వేరే మరొకరున్నారని, వారికి నేనంటే సహజవాత్సల్యం ఉట్టి పడుతూందని నన్ను చూడాలని కుతూహల పడుతుంటారని అప్పటికి నాకు తెలియనే తెలియదు. మా అమ్మా, నాన్నా వస్తే యెవరో బంధువులు వచ్చారనుకొన్నాను. ఇంట్లోకి రాగానే, మా అమ్మ నన్ను దగ్గరకు రమ్మని పిలిచింది. నేను కొత్తవాళ్ళ దగ్గరకు వెళ్ళటానికి బిడియపడేవాణ్ణి. నేను పోకపోయేసరికి ఏమనుకొందో ఏమో, మళ్లీ నన్ను పిలవలేదు. పాపం ఆమె మనస్సు ఎంత బాధ పడిందో, నాకా వయస్సులో అర్థమవక పోయినా, ఇప్పుడర్థమవుతూంది ఆమె ఆ రోజు ఎంత ఖేద పడి ఉంటుందో!

ఆమె నేను ఇంట్లో తిరుగుతూన్నంతసేపూ నా వేపు లాలనగా జాలిగా చూసేది. ఆ చూపులలో ఏమి అయస్కాంతముందో కాని, నాకామె ఒడిలో జేరి, నోరారా "అమ్మా" అని పిలుద్దామనిపించేది. కాని బిడియ పడ్డాను నాకై నేను వెళ్లటానికి. వాత్సల్యం తొణికిసలాడే చూపులతో నన్ను చూసేసరికి, నాకు ఏదోలావుండేది. మా పెంపుడమ్మ కూడా నన్ను దగ్గరకు పిల్చేది, ఎత్తుకొనేది, పిప్పరమెంట్లు బిస్కత్తులుయిచ్చేది. కాని నేనెప్పుడూ మా పెంపుడమ్మదగ్గర అలాంటి పరవశత్వాన్ని పొందలేదు. అలాంటి సౌమ్యత, మార్దవం ఎందుకో నా కంటికి అగుపించలేదు. అది నా కంటి దోషమేమో! కాకుంటే ఈ

అమ్మ నాకు కావలసినదల్లా కొనిస్తూండే, అడిగినప్పుడు లేదనకుండానే తినుబండారాలు కొని పెడుతూండే. అయినా, ఈ అమ్మ దగ్గరున్నపుడు పొందలేని ఆనందం, పరవశత్వం, తృప్తి, కొత్తగా వచ్చిన అమ్మ నన్ను చూసినంత మాత్రంతో నాలో అలాంటి పులకరింపు ఎందుకు కలగాలి? ఆలోచించాను నా చిన్న మెదడుకు అందలేదు. రక్తస్పర్శ అంటే అంతే కాబోలు.

ఆ రోజు మా యింట్లో ఎవరూ వాళ్ళతో సరిగా మాటాడలేదు. మాట వరసకి ఏవో రెండు కుశలప్రశ్నలు వేశారు. అందరూ ముభావంగా ఉండిపోయారు. ఆ రోజు ఇంటి వాతావరణం నాకు చాలా విచిత్రంగా కనిపించింది. వంటావిడే మా అమ్మా, నాన్నని స్నానాలు చేసి భోజనాలకు రమ్మంది. ఆ పరిస్థితులలో వారేమి తిని ఉంటారో నాకిప్పుడర్థమవుతూంది. ఉపేక్షా, విముఖత్వం, నిరాదరణ తాండవిస్తూన్న ఆ యింట్లో నాలుగు మెతుకులు ఎంగిలిపడి ఉంటారేమో కాని, ఆ భోజనం వాళ్ళకి వంటపట్టి ఉండదు.

మధ్యాహ్నం చావట్లో జనకతండ్రి ఈ నాన్నా ఏదో తీవ్రంగా చర్చించుకొంటున్నారు. మా అమ్మ చావట్లో ఓ మూల కూర్చొని, వాళ్ళ సంభాషణ వింటోంది. నేను ప్రక్కగదిలో పెంపుడమ్మదగ్గర కూర్చొని, దేవుడికి వత్తులు నలుస్తూంటే చూస్తున్నాను.

వాళ్ళమాటలు సరిగా జ్ఞప్తి లేకపోయినా, వాళ్ళ సంభాషణా సారాంశం జ్ఞప్తి ఉంది. వాళ్లుచేసిన సంభాషణంతా నన్నుగురించే. ఈ నాన్న, జనక తండ్రితో అన్నాడు: "అబ్బాయిని మీరు చెడుపుతున్నారు. ఏమిటేమిటో చెప్పి వాడి బుద్ధుల మార్చేయాలని చూస్తున్నారు. కుర్రాణ్ణి దత్తత చేసింతర్వాత చట్టప్రకారం వాడి ప్రస్తావన, వాడి బాగోగులు మీ కవసరంలేదు. ఆ పూచీ నాది. లేనిపోని మమకారాలు చూపించి, వాణ్ణి ఎందుకు కొరగానివాణ్ణి చేస్తున్నారు? దత్తు తీసుకొన్న కుర్రాడి రక్షణ వాడి చదువూ, మొదలైన విషయాలనుగురించి ఆలోచించే బాధ్యత నాకు తెలియకపోలేదు. ఇక వాడి విషయంలో మీరెలాంటి జోక్యం కలిగించుకోవద్దు" అని.

మా నాన్న ఆ మాటలతో కుంగిపోయాడు. ఛర్రున కొరడాఝురికతో కొట్టినట్లయింది.

మరేం జవాబు చెప్పలేదు.

నేను పక్కగదిలో ఉన్నప్పటికీ మా అమ్మ నాకు బాగానే కనిపిస్తూంది. ఆమెవేపు చూశాను. ఆమెకళ్లు నీళ్ళతో నిండుకొన్నాయి. ఆమె యెందుకు ఏడుస్తూంది? ఆమెకు నామీద యెందుకంత అభిమానం? ఈ ప్రశ్నలకు నాకు సమాధానం అప్పుడు తెలియలేదు.

"అయితే ఇక వెళ్ళొస్తాం" అన్నాడు మా నాన్న.

మా అమ్మ పమిటకొంగుతో కళ్ళ నీళ్ళు తుడుచుకొని ప్రయాణానికి సిద్ధమైంది. వెళ్ళే ముందు నన్నెత్తుకొని ముద్దు పెట్టుకొంది. ఈ పర్యాయం నేను రానన లేదు. ఆమె ముద్దు పెట్టుకొంటే, నామనస్సు ఎక్కడో పాస స్రోతస్సులలో తేలిపోతూన్నట్లనిపించింది. అమృతవాహినులను వర్షించినట్లయింది. అలాంటి అనుభూతిని, నేనిదివర కెన్నడూ పొందలేదు. ఆ ముద్దులో ఉన్న దివ్యత్వం, నాకిక ఎప్పుడూ కనిపించలేదు.

మా అమ్మా, నాన్నని సాగనంపటానికి వాకిట్లోకి ఎవరూ వెళ్ళలేదు. మా అమ్మ వెడుతూ నావేపు జాలిగా చూచి నవ్వింది. నేను అప్రయత్నంగా వాకిటవరకూ వెళ్ళాను. నన్నెవ్వరూ అడ్డగించలేదు. మా అమ్మ మాటిమాటికీ వెనక్కు చూస్తూ పోయింది. వాళ్లు వీధిమలుపు తిరిగేవరకూ, అలానే చూస్తూ నిల్చుండిపోయాను." అని ఆగాడు సోమూ.

*

గొంతు బొంగురుపోయింది. మాట పెగిలి రాలేదు. అంతవరకూ సోమూ, కాఫీ త్రాగలేదని అప్పుడే గమనించాను.

"సోమూ, మొదట కాఫీత్రాగు చల్లారిపోతుంది" అన్నాను.

సోమూ రెండు గుటకలలో చల్లారిపోయిన కాఫీ, గొంతులో పోసుకొని గొంతు తడియార్చుకొన్నాడు. మళ్ళీ ప్రారంభించాడు.

* * *

"అప్పణ్ణుంచీ, మాకూ వాళ్ళకూ మాటలు

నిలిచిపోయాయి. రాకలుపోకలు కూడా లేవు. మళ్ళీ మామూలుగా నా ఆటపాటల్లో మునిగిపోయాను. మా అమ్మా నాన్నా విషయం కనుక్కొనేందుక్కూడా అవకాశం కలగలేదు.

ఒకరోజు సాయంత్రం కొమ్మోను నేను బడినుండి వస్తున్నాను. ఎవరో వెనుకనించి "సోమూ" అని పిలిచారు. వెను దిరిగి చూశాను. ఎవడో ఒకాయన చిన్నవాడే, నన్ను దగ్గరకు పిలిచి చాకలేట్ల పొట్లాం నా చేతి కియబోయాడు. నాకు చాకలేట్లంటే ఇష్టమని అతడికెలా తెలిసిందో! మొదట్లో వద్దన్నాను. వద్దంటున్నా బలవంతాన, నా చేతిలో పెట్టి "బాగా చదువుకొంటున్నావా! బాబూ!" అన్నాడు.

"ఊఁ" అన్నాను. అతనిముఖం ఎక్కడో పరిచితమైందిలా ఉంది. సరిగా గుర్తుకి రాలేదు. కాని లీలగామాత్రం మా యింట్లోనే ఎప్పుడో చూచినట్లు గుర్తు.

మళ్ళీ అతనే అడిగాడు: "అయితే బాబూ అమ్మకి ఏం చెబుతావు" అని.

"అమ్మ యింట్లో ఉందిగా. నే నిప్పుడు అమ్మదగ్గరకే వెడుతున్నా" అన్నాను.

అతను ఏమనుకొన్నాడో ఏమో ఒకసారి నిట్టూర్చి "అయితే ఇంటికి జాగ్రత్తగా వెళ్లు. కార్లూ బండ్లూ వస్తూంటాయి" అని నే వెడుతూంటే నావేపేచూస్తూ నిల్చున్నాడు. నేను వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ యింటికొచ్చాను. నా చేతిలో చాకలేట్ల పొట్లంచూచి,

"సోమూ! ఎక్కడివిరా, యివి" అంది మా పెంపుడమ్మ.

"ఎవరో బళ్ళోంచి వస్తూంటే పిల్చి, ఇచ్చారేఅమ్మా" అన్నాను. నా మాట నమ్మలేదు.

"ఎవ్రరా వెధవా! నీకు దారినవెడుతూంటే పిల్చి చాకలేట్లు ఇచ్చేది" అని కేక లేసింది.

నేను ఆనవాళ్లు చెప్పి, ఫలానా ఆయన ఇచ్చాడని చెప్పేశాను.

నా చేతులో చాకలేట్లు తీసుకొని "ఇవి తినకూడదురా నాన్నా! దారిపోయే వాడెవడో ఏదో ఒకటిస్తే తినెయ్యడమేనా? తప్పుగాదూ? మనింట్లోఇంతకన్న మంచితాయం ఉంది పెడతానురా" అని తన పెట్టెలో దాచి ఉంచిన ఇన్ని పిప్పరమెట్లు నాచేతిలో పోసింది నిజంలో నాకు చాకలేట్లు తినాలని ఉన్నా., అమ్మ చెప్పినమాటలను బట్టి ఎవరో కరాయివాళ్ళిచ్చినవి తినకూడదను కొన్నాను కాని అప్పట్లో నాకేం తెలుసు ఆ చాకలేట్లు ఇచ్చిన అతను మా అన్నయ్యేనని!

"అయితే సోమూ! మీ అన్నయ్య యిక్కడి కెప్పుడేనా వస్తూంటాడా?" అని అడిగా నేను.

"అదీ చెబుతున్నానుగా. ఆ రోజు మా అన్నయ్య కనిపించినతరువాత మా ఊరివాళ్లెవరూ కనిపించలేదు. కాలప్రవాహంలో రెండేళ్లు దొర్లుకొనిపోయాయి. అప్పుడు నేను మూడో ఫారం చదువుతున్నాను ఇంటిపరిస్థితులు కొద్ది కొద్దిగా అవగాహమవటం మొదలెట్టాయి. నేనాయింటికి దత్తపుత్రుడననీ, నన్ను కన్న అమ్మా, నాన్నా వేరే ఉన్నారని తెలుసుకోగలిగాను.

రాత్రి ఎనిమిదిగంటలై ఉంటుందేమో! నేను భోజనంచేసి దీపంముందు కూర్చొని చదువుకొంటున్నాను. వాకిట్లో ఏదో అలికిడి అయింది. పిలిచినట్లుగా ఉంది. నేను దీపం తీసుకొని, తలుపుతీశాను. మా చాకలేట్ల అన్నయ్యే. నన్ను చూడగానే—

"బాబూ! నాన్నని పిలూ" అన్నాడు నే వెళ్లి నాన్నని పిల్చుకొనివచ్చాను నాన్న అన్నను చూడగానే ఎందుకో ముఖం చిట్లించుకొన్నాడు.

"ఏం ఎందుకొచ్చావ్" అన్నాడు కటువుగా. ఎందుకు నాన్న అలా అన్నయ్యని అంటున్నాడో నాకు అర్థమవలేదు. ఇంటికొచ్చినవాణ్ణి మర్యాదగా మంచీ చెడూ విచారించటం పోనిచ్చి, అలా తూలనాడినట్లు మాట్లాడటం నా మనస్సుకు కష్టంవేసింది. అన్నయ్యను చూస్తే నాకు జాలేసింది. అన్నయ్యే చెప్పటం మొదలెట్టాడు దీనంగా.

"మరేంలేదు చిన్నాన్నా! అమ్మకి చాలా జబ్బుగా ఉంది. ఇక బతకదని దించి దిగువన కూడా పెట్టారు. వైద్యులుకూడా ఇక లాభం లేదని చెప్పారు" అని ఆగాడు. దుఃఖంతో

గొంతు పూడుకొనిపోయింది, మాట పెకిలి రాలేదు, అన్నయ్య ఆ మాటలంటూంటే నాకు ఎందుకో దిగులేసింది. అమ్మకి జబ్బు చేసిందని వినగానే మనస్సు బాధపడింది, నాలోని రక్తసంబంధమైన ఆత్మీయత నా గుండెల్ని కలచివైచింది. నాలో మాటుమణిగిన అభిమానం మరలా, నా హృదయాన్ని ఆందోళనపరచింది.

"అయితే, ఇప్పుడు నీవనేదేమిటి?" అన్నాడు నాన్న తీవ్రంగా.

"అబ్బాయిని చూడాలంటూంది అమ్మ. ఒకమారు నాతో పంపిస్తే, అమ్మకి చూపించి, నేనే రేపీవేళకి తీసికొచ్చి దిగబెడతాను" అన్నాడు ప్రాధేయపడుతూ.

"వాడికివి పరీక్షలదినాలు. ఇప్పుడు ఈ ఆ ఊరు తిరుగుతూంటే, పరీక్షలలో సరిగా వ్రాయలేకపోవటమే కాక ఆరోగ్యంకూడా చెడుతుంది."

మా నాన్నమీద నా కెక్కడలేని కోపం వచ్చింది. అలా అన్నయ్య బ్రతిమాలుతూంటే ఓ పూట పంపిస్తే ఏంపోయింది. ఒకపూటలోనే చదివేదంతా ఎత్తిపోతుందా?

మొదట్లో మా నాన్న వీల్లేదన్నా, చివరకి మెత్తపడ్డాడు, అన్నయ్యతో ఒకపూట పంపించటానికి ఒప్పుకొన్నాడు.

ఉదయమేలేచి బయల్దేరాం ఊరికి. ఎందుకో ఊరికి వెడుతున్నానంటే క్రొత్త క్రొత్త అనుభూతులతో నా ఒళ్లు పులకరించింది. ఒక ఆత్మీయమైన వస్తువును పోగొట్టుకొన్నవాడు, మరలా ఆ వస్తువును పొందకలిగినపుడు వాడిలో కలిగే, ఆనందం, సరిగా అదేలాంటి సంతృప్తి నాలో కలిగాయి.

బస్సు పోతూన్నంతసేపూ నా మెదడులో ఎన్నెన్నో ఆలోచనలు పరువులెత్తాయి. ఆ రోజు మా అమ్మ నా వేపు ప్రేమతో, లాలనగా చూట్టం, మా నాన్నా వాళ్లూ ఘర్షణపడుతూంటే కళ్లనీళ్లు పెట్టుకోవటం, నా కళ్ళకి కట్టినట్లయింది. బస్సుకన్నా ముందే నామనస్సు మా అమ్మదగ్గర వ్రాలిపోయింది. అమ్మ నన్ను చూడగానే, అంత జబ్బులో కూడా సంతోషంతో నన్ను దగ్గరకు తీసుకొన్నట్లు, నేను అమ్మ ఒడిలో తల దూర్చుకొని "అమ్మా" అని పిలిచినట్లు ఊహించుకొన్నాను. కళ్ళలో నీళ్లు తిరిగాయి. అవి ఆనందాశ్రువులో దుఃఖాశ్రులో నే నిప్పటికీ చెప్పలేకుండావున్నాను.

బస్సు ఆగింది. నేనూ, మా అన్నయ్య బస్సు దిగాము. అక్కణ్ణుంచి మా ఊరికి రెండు మైళ్ళు నడవాలి. డొంకలలో పొలం గట్ల మీద ఎప్పుడూ నడిచిందిలేదు. కష్టంగా వుండింది నడవటం. ఎండ మండిపోతోంది. పోను పోను మా నీడలు మా పాదాల క్రింద ఒదుక్కొంటున్నాయి.

ఊరి పొలిమేరలకు వచ్చాము. మమ్మల్ని చూచి కుక్కలు అరవటం మొదలెట్టాయి. దారిలో మా పాలేరు కనిపిస్తే, అన్నయ్య అడిగాడు "ఏంరా! వెంకొయ్! అమ్మ కెలా ఉంది?" అని.

"ఎలా ఉండేంటి బాబు! నిన్న సందాళ మీరు ఊరు దాటి బస్సులెక్కోడి కెళ్లుంటా రేమో! పాపం చల్లగా దాటేసుకొంది. పుణ్యాత్మురాలు. ఆమె కేం బాబు! చల్లని తల్లి" అన్నాడు.

"ఆఁ" అన్నాడు అన్నయ్య కుప్పకూలిపోతూ. గొంతులో ఉండే దుఃఖపు జీర వెలికి వచ్చింది. అమ్మ చనిపోయింది! ఎంత దారుణం! నా గుండెఆగిపోయినట్లయింది. అమ్మ చనిపోవటం నాకు నమ్మరాని విషయమైంది. ఆ అమ్మ దగ్గర పెరిగింది లేదు సరిగదా, ఆ అమ్మ చేతి మీదుగా ఒక్కనాడైనా అన్నం తిన్నది లేదు. కాని ఎందుకో అమ్మ చనిపోయిందనగానే నా ఒళ్ళు గగుర్పొడిచింది. గుండెల్లో చీకట్లు గూడుకట్టుకొన్నాయి. ఏదో అత్యంత ప్రియమైన, సన్నిహితమైన వస్తువును పోగొట్టుకున్న వాడిలా అన్నయ్య వెనకాలే నడిచాను. నడుస్తూంటే, భూమిలో సొరంగాలు పడి ఎక్కడికో దిగజారి పోతున్నట్లనిపించేది.

ఇల్లంతా రోదనలు. నన్ను చూడగానే నాన్న నన్ను కౌగలించుకొని పెద్దపెట్టున ఏడ్చేశాడు. నేనప్పుడు ఏంచేయాలో తెలీక ఒక క్షణం నిర్లిప్తంగా నిల్చుండిపోయాను. మా అమ్మ అక్కడే నిశ్చింతగా పడుకొని ఉంది. ఆమె ముఖంలో మునుపటి సౌమ్యత, మార్దవం

మానిపోలేదు. ఎప్పటిలాగా, చిరునవ్వు తొణికిసలాడుతూంది. ఒకలిప్త అమ్మ చనిపోలేదనే అనుకొన్నాను. ప్రేమతో నన్ను పిలుస్తూన్నట్లుగా ఉంది.

చనిపోయేముందు అమ్మ అనిందట, "అబ్బాయిని పెంచుకొనే తాహతు మనకు లేకపోవటం చేతగదా పరాయివాళ్ళ యింటికి మన కుర్రవాడిని పంపిచాల్సి వచ్చింది, చివరకు అబ్బాయిని కడసారిగా చూచే అదృష్టం కూడా లేక పోయింది" అని.

ఆ మాట వినగానే నా గుండెలు బరువెక్కాయి. దుఃఖం పొర్లుకొనివచ్చింది. పెద్దగా యేడ్చేశాను."

* * *

అని సోమూ మాటాడలేకపోయాడు. ముఖంమీద చేతులుంచుకొని యేడవటం మొదలెట్టాడు. సోమూని ఓదార్చాను అతని సున్నితమైన హృదయం ఈ తీవ్రాఘాతంతో ముక్కవోయింది.

"ఇప్పుడైనా చెప్పు, నేను శాంతంగా జవాబు చెప్పక పోవటంలోగల కారణం సబబుగా ఉందా" అని ఎదురు ప్రశ్న వేశాడు

సంజె చీకట్లు గది గోడల మీదకు మెల్ల మెల్లగా ప్రాకాయి.

# విజ్ఞాన వీథి

## గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

విజ్ఞానవీథికి ఆదీ, అంతం అంటూ లేవు. శాస్త్రజ్ఞుడు నడిచేకొద్దీ, ఆ వీథి పొడుగు పెరుగుతూఉంటుంది. విజ్ఞానవీథిలో శాస్త్రజ్ఞుడు వేసిన ముందడుగులు కొన్ని సూచిస్తాను.

అస్వస్థతచెందిన శరీరాలకు ఆరోగ్యాన్ని చేకూర్చటానికి మందులతోపాటు అనేక ప్రక్రియలున్నాయి. రక్తక్షీణంవల్ల బాధపడే కొన ఊపిరిమనిషికి మహాప్రసాదంలాగా బ్లడ్ బ్యాంక్ అవతరించింది. బ్లడ్‌బ్యాంకీలో దాతలు ఇచ్చేరక్తాన్ని దాచి, ఉంచి అవసరమైన రోగులకు ఇచ్చి వారిని రక్షిస్తున్నారు. ఇటువంటి బ్యాంకులు ఒక్క రక్తానికే కాక, ఇటీవల ఎముకలకూ, రక్తనాళాలకూ, కళ్లకూ, నరాలకు కూడా బ్యాంకులు వచ్చాయి. డాక్టర్ గెర్బ్స్, జెకబ్ మొదలయిన శాస్త్రజ్ఞుల పరిశోధనలు ఊపిరితిత్తులకు కూడా ఇటువంటి బ్యాంకులు త్వరలోనే రాగలవని సూచిస్తున్నాయి. మనిషి చనిపోయిన వెంటనే ఊపిరితిత్తులలో ఎక్కువ మార్పు కాదు. ఈ ఊపిరితిత్తులను గుండెఆపరేషన్లలో రక్తాన్ని పరిశుభ్రపరచటానికి ఉపయోగించవచ్చు. ప్రస్తుతం దీనికి పంపులను ఉపయోగిస్తున్నారు. ఊపిరితిత్తుల బ్యాంకులు (లంగ్ బ్యాంక్స్) కనుక వచ్చినట్లయితే, గుండె ఆపరేషన్లలో చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

మరొక తమాషా. ఒక వ్యక్తికి గుండె 25 నిమిషాలు ఆగినతర్వాత. అది మళ్లీ ఆడటం మొదలుపెట్టింది. డాక్టర్ కార్బర్ గుండెకు ఉత్తేజకమైన మందులను లోపలికి ఎక్కించి గుండెనురుద్ది, కృత్రిమశ్వాసపద్ధతిని 25 నిమిషాలు ఆగిన గుండెను మళ్ళీ కొట్టుకునేటట్లు చేశారు,

* * *

ఎక్స్‌రే ప్రస్తుతం ప్రాబల్యంలో ఉంది. ఇవి ఎముకలు, ఊపిరితిత్తులు మొదలయిన అవయవాల వ్యాధులను సూచించగలవు కన్ను, చెవి, ముక్కు, నోరు, గొంతు మొదలైనవాని లోపలిభాగాలను పరీక్షించటానికి కెమెరాలను, క్లెపెన్ హారీ ఆర్. వైట్ నిర్మించారు. ఇవి డాక్టర్ల నిత్యజీవితంలో ఎంతైనా ఉపయోగంగా ఉంటాయి.

* * *

టెలివిజన్ చూసే కళ్లకు శ్రమను తగ్గించటానికి, కొత్తరకం కళ్లద్దాలు కనిపెట్టారు. ఎక్కువ కాంతివంతమైన వెలుగులో, కళ్లకు వరసగా నీలం, ఆకుపచ్చ, తెలుపు, ఎరుపు రంగులు అధికంగా సోకుతాయి. ఈ కొత్త కళ్లద్దాలు అవసరమైనంతవరకు నీలం రంగు కిరణాలను గ్రహించి కళ్లకు కొంత విశ్రాంతిని చేకూరుస్తాయి.